క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.2.07 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సీటీఆర్ఐ: గోదావరి గట్టున గల ఉమా మార్కండేయేశ్వర స్వామి వారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆరు నెలల 24 రోజులకు గాను రూ.2,07,658 వచ్చిందని ఆలయ నిర్వాహణాధికారి ఆర్. శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వెహికల్ ఫ్రీడే

కంబాలచెరువు: ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ప్రతి నెలా రెండు, నాలుగో శుక్రవారాల్లో వెహికల్ ఫ్రీడే నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు గురువారం తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కళాశాలలోకి ఎటువంటి ఇంధన వాహనాలను అనుమతించబోమన్నారు. ఆరోగ్యం, ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. దీని నిర్వహణను కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ విభాగాలకు కేటాయించామన్నారు.

వృద్ధులకు అన్నదానం



భోజనం పంపిణీ చేస్తున్న పోసికుమార్

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజు జన్మదినం సందర్భంగా గురువారం ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో కిరణ్ రాజు జన్మదినోత్సవం నిర్వహించారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు ఆహార పొట్లాలను అందజేశారు.

కార్యశాల చక్కని వేదిక



మాట్లాడుతున్న సమన్వయకర్త సూర్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: పాఠ్య పుస్తకాలలో కఠిన అంశాలను గుర్తించేందుకు కార్యశాల ఒక చక్కని వేదిక అని జిల్లా ఏఎంఓ గౌరీశంకర్ అన్నారు. గురువారం బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో 8, 9 తరగతుల భౌతికశాస్త్ర పాఠ్యపుస్తకాలలో కఠిన అంశాల గుర్తింపుపై జరిగిన కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యశాలకు మూడు జిల్లాల నుంచి 8, 9 తరగతులకు భౌతిక శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులు హాజరై వివిధ అధ్యాయాలలో కఠినతరమైన అంశాలను గుర్తించారు. సీఎంఓ శ్రీనివాస్, సమన్వయకర్తలు కేవీ సూర్యనారాయణ, డీఎస్పీ సత్యనారాయణ, జె.కళావతి, కె.గంగాధరరావు పాల్గొన్నారు.

లభ్యం కాని యువకుడి ఆచూకీ

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక వద్ద కోటిపల్లి కాలువలో గల్లంతైన మోహనరావు అనే యువకుడి ఆచూకీ మూడు రోజులైనప్పటికీ ఇంకా లభ్యం కాలేదు. మంగళవారం అతడు ప్రమాదవశాత్తూ కాలువ రేవులో జారిపడిపోయిన విషయం విదితమే. గజ ఈతగాళ్లు, కుటుంబ సభ్యులు గత మూడు రోజులుగా కాలువ వెంబడి వెతుకుతూనే ఉన్నారు. గురువారం చీకటి పడే వరకూ గజ ఈతగాళ్ల సాయంతో కాలువను జల్లెడ పట్టారు. అయినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. చొప్పెల్ల లాకులు, కపిలేశ్వరపురం, కోటిపల్లి వరకూ కాలువ వెంబడి మోహనరావు కుటుంబ సభ్యులు, బంధువులు పరిశీలిస్తూ వెళ్లినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదు. కాలువరేవులో పడిపోయినప్పుడు నీటి ఉధృతి ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

అకడమిక్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ

కంబాలచెరువు: ఉపాధ్యాయులందరూ విద్యార్థుల అకాడమిక్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాజమహేంద్రవరం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఈవీవీఎస్ నారాయణ అన్నారు. స్థానిక నాగరాజా ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల నోట్స్‌లను పరిశీలించారు. సిలబస్ తదితర వాటిపై ఆరా తీశారు. ఉపాధ్యాయులందరూ విధిగా లెసన్ ప్లాన్, డైరీలను అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయులు చక్రధర్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలి అవసరం

- ఎయిడ్స్ బాధితుల్లో యువతే అధికం
- కలెక్టర్ మాధవీలత
- నగరంలో ఉత్సాహంగా 5కే రన్



5కే మారథాన్ రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక వై.జంక్షన్ నుంచి ఇస్కాన్ టెంపుల్ వరకూ బుధవారం జరిగిన మారథాన్ 5 కే రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 17 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉన్న యువత ఎయిడ్స్ బారిన పడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. యువత వివిధ సామాజిక మాధ్యమాలను ఎక్కువగా వాడుతుండటం జరుగుతోందన్నారు. ఒక మంచిని, మేలు చేకూర్చే పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువతలో ఎయిడ్స్ కంట్రోల్ పై అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేఫ్ సెక్స్, సేఫ్ లైఫ్ నినాదంతో ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎయిడ్స్ నియంత్రణ కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకుని వచ్చే దిశగా అడుగులు వేయడం జరుగుతోందన్నారు. 5 కే మారథాన్ పరుగులో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేల రూపాయలు, మరో ఏడుగురికి ప్రోత్సాహక బహుమతులుగా రూ.1000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎల్ఏటీ డాక్టర్ ఎన్.వసుంధర, జిల్లా స్పోర్ట్స్ కోచ్ బీఎంఎం.శేషగిరి, ఎస్ఎల్ఈపీ డాక్టర్ లక్ష్మీదేవి, ఆదిలింగం, డాక్టర్ యూజే కిరణ్, డాక్టర్ ఆర్.శిల్ప, ఏఆర్టీ సిబ్బంది, జిల్లా క్షయ నివారణ సిబ్బంది, జిల్లాలోని వివిధ కళాశాలల పీఈటీ సిబ్బంది, 108 సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు

ప్రకాశం నగర్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, అవగాహన కోసం నగరంలో నిర్వహించిన మారథాన్ 5 కే రన్‌లో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు తెలిపారు. జె.వేదవ్యాస్ ప్రథమ బహుమతిగా రూ.పదివేలు, కె.రమేష్ ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు గెలుచుకున్నారన్నారు. వీరు కలెక్టర్ కె.మాధవీలత చేతుల మీదుగా త్వరలోనే ప్రశంసా పత్రాలు అందుకుంటారన్నారు.

అంతర్జాతీయ టెన్నిస్ పోటీలకు శివాజీ



ప్రకాశం నగర్: వరల్డ్ డెఫ్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలకు రాజమహేంద్రవరానికి చెందిన పిల్లా శివాజీ ఎంపికైనట్లు అతడి తండ్రి బాల గురు వారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల త్రివేండ్రంలో జరిగిన జాతీయ పోటీల్లో శివాజీ విజయం సాధించి, అండర్ 18 విభాగంలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడన్నారు. ఈనెల 23న గ్రీస్‌లో జరిగే వరల్డ్ డెఫ్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం సాయంత్రం గ్రీస్‌కు బయలుదేరి వెళ్లాడన్నారు. ప్రభుత్వ వీటీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శివాజీ స్పెయిన్‌లోని టెన్నిస్ కోచ్ జార్జ్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు.

బీసీల పోరాటానికి సంపూర్ణ సహకారం



జంతర్ మంతర్ వద్ద మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

సీటీఆర్ఐ: బీసీల న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అనసూరి పద్మలత నేతృత్వంలో గురువారం చేపట్టిన బీసీ డిమాండ్లు - ఛలో ఢిల్లీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీల పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. బీసీల అభ్యున్నతి కోసం నాడు మహాత్మా జ్యోతీరావు పూలే ఎంతో కృషి చేశారని, ఆయన బాటలోనే నేడు ముఖ్యమంత్రి జగన్ పయనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం గొప్ప విశేషమన్నారు. జాతీయ బీసీ మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ అనసూరి పద్మలత ప్రమాణ స్వీకారం చేపట్టిన నాటి నుంచి పూర్తి స్థాయిలో బీసీల అభ్యున్నతి కోసం పూర్తి సమయాన్ని కేటాయిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో బూడిద శరత్ కుమార్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు, పురుగుమందులు

- ఈ-పంట నమోదుకు నెలాఖరు వరకూ గడువు
- వ్యవసాయ మండలి సమావేశంలో జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ: జిల్లాలో రైతులు ఇబ్బంది పడకుండా ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, పురుగుమందులను సిద్ధం చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ-పంట నమోదుకు ఈనెలాఖరు వరకూ గడువు ఉందని, ఆ మేరకు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌లో శనగను సాగుచేసే రైతులకు అవసరమైన విత్తనాలు అక్టోబర్ 15 నాటికి అందుబాటులో ఉంచాలన్నారు. నూరుశాతం సీసీఆర్సీ కలిగిన కౌలు రైతులకు పంట రుణాల మంజూరుకు బ్యాంకర్లతో మండల, ఆర్బీకే స్థాయిలో సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-పంట నమోదు సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేసి, సామాజిక తనిఖీలు అక్టోబర్ 3 నుంచి 10 వరకు చేపట్టాలన్నారు. చైర్‌పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులకు 95,467 సీసీఆర్సీ కార్డులను అందచేశామన్నారు. అలాగే 16,040 మంది కౌలు రైతులకు రుణాలు అందించడం జరిగిందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే తేజా, జి.జనార్దనరావు, వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం. నంద కిషోర్ పాల్గొన్నారు.

30 వరకూ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు



బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో సామూహిక సీమంతం

రాజమహేంద్రవరం రూరల్: తల్లిపాల విశిష్టతపై మహిళలను చైతన్యవంతులను చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని, ఈనెల 30 వరకూ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను నిర్వహిస్తోందని జిల్లా, స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి అన్నారు. గురువారం బొమ్మూరులోని జేఎల్‌బీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని, ఆరు నెలల వరకూ బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఆహారంగా అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో కనకవల్లి, మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు, సూపర్ వైజర్ బేబీరాణి, శిరీష, సచివాలయ కన్వీనర్లు ఎలుగొండ లక్ష్మి, సద్గుణ రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- శాటిలైట్‌సిటీలోని జక్కంపూడి రామ్మోహన రావు కళ్యాణ మండపంలో 13 అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీడీపీవో నాగమణి పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

కడియం: ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కనకవల్లి సూచించారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా దుళ్ల సెక్టార్ పరిధిలోని మురమండలో గర్భిణులకు గురువారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనకవల్లి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ కోఆర్డినేటర్ వీవీ దీపిక, అంగన్‌వాడీ సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావు జయంతి

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం గురజాడ అప్పారావు జయంతిని గురువారం నిర్వహించారు. తెలుగుశాఖ ఆధ్వర్యంలో గురజాడ సాహిత్యం, జీవితాంశాలు, సంస్కరణలపై విద్యార్థులకు వక్తృత్వ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ కేఏస్ రత్నకుమార్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, పి.కుసుమ కామేశ్వరి, తెలుగు అధ్యాపకులు కేఏస్.అన్నపూర్ణాదేవి, పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించండి



గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధుడితో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి గురువారం తపాలా సేవకులతో సమావేశం నిర్వహించారు. తపాలా శాఖ, న్యాయ సేవాధికార సంస్థలు అందిస్తున్న సేవలు, నల్సా పథకాలపై ప్రజలలో విస్తృతంగా అవగాహన పెంచాలన్నారు. వారి సమస్యలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవా కమిటీల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రీ దేవి మాట్లాడుతూ పర్మనెంట్ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో వారికున్న వివాదాలకు పరిష్కారం పొందవచ్చన్నారు. అనంతరం న్యాయమూర్తి ప్రత్యూష కుమారి స్థానిక గౌతమీ జీవ కారుణ్య సంఘాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. అక్కడ వృద్ధులతో మాట్లాడారు.

స్వచ్ఛత పాటిస్తే వ్యాధులు దూరం



మాట్లాడుతున్న చవాన్ శ్యామ్‌రాజు నాయక్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటిస్తూ స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజు నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కాతేరు వ్యవసాయ కళాశాలలో 15 రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాన్ని ఆయన విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్‌రాజు నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌పై పోరాడటం, ప్లాంటేషన్ డ్రైవ్, స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని మరింతగా ముందుకు తీసుకువెళ్లడం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చునన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.

త్యాగరాజుకు పలువురి పరామర్శ



త్యాగరాజును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాల్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ బొమ్మూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజును గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ పరామర్శించారు. త్యాగరాజు సతీమణి రమాదేవి ఇటీవల మృతి చెందారు. అలాగే వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), లింగం రవి, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, మాజీ సర్పంచ్‌లు మద్దిపోటి శంభాజీరావు, మద్దిపోటి గంగాభవాని, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు త్యాగరాజును పరామర్శించిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: ఎంబీబీఎస్ సీట్ల రెండో కౌన్సెలింగ్ అడ్మిషన్లను తక్షణమే రద్దుచేసి, నష్టపోయిన రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సూచనల మేరకు గురువారం సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు.

ముగిసిన పారాయణ యజ్ఞం

రాజానగరం: లోకకల్యాణం, ప్రపంచ శాంతిని కోరుతూ స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో 12 గురువారాలు చేపట్టిన పారాయణ యజ్ఞం ఈ వారంతో వైభవంగా ముగిసింది. సాయిభక్త మండలి ఆధ్వర్యంలో 11 గురువారాలు గురు చరిత్రను, 12వ వారం సాయి సచ్చరిత్రను పారాయణ చేశారు. వేకువజామున బాబాకు కాకడ హారతి ఇచ్చిన అనంతరం పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించి, సాయంత్రం వరకూ ఒక్కొక్కరు ఒకటి, రెండు, మూడు అధ్యాయాలను పారాయణ చేస్తూ 52 అధ్యాయాలను పూర్తి చేసేవారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ సాయి సచ్చరిత్ర పుస్తకాలను కానుకగా అందజేశారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం



మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును లోకసభలో ఆమోదించడం హర్షణీయమని రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ప్రకటించారు. ప్రధాని మోదీ చొరవతో నూతన పార్లమెంట్ భవనంలో ఆమోదం పొందిన తొలి బిల్లుగా నారీశక్తి వందన్ చోటు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. ఈ బిల్లు ద్వారా చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దక్కబోతుందన్నారు. దీనిలో ఓబీసీ కోటాను కూడా చేర్చినప్పుడే ఈ బిల్లుకు మరింత పరిపూర్ణత చేకూరుతుందన్నారు. సీఎం జగన్ ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థలలో 50 శాతం కోటాను అమలు చేస్తున్నారన్నారు. దేశం మొత్తం దీన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఎం జగనన్న సారథ్యంలో వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన నాటి నుంచీ రాష్ట్రంలో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

ప్రధానమంత్రికి ధన్యవాదాలు

రాజమహేంద్రవరం రూరల్: నారీశక్తి వందన్ బిల్లు ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మండల బీజేపీ అధ్యక్షుడు ఎన్‌వీబీఎస్ ఆచారి ఆధ్వర్యంలో జాస్తి బుల్లెమ్మాయి మహిళా కళాశాల విద్యార్థినులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ సిటీ కన్వీనర్ యెనుముల రంగబాబు మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం మహిళలకు స్థానం కల్పించడం ద్వారా భారతీయ స్త్రీ మూర్తులకు న్యాయం జరుగుతుందన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



పుష్కరఘాట్‌ను శుభ్రం చేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అలవాటు చేసుకోవాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల పిల్లలతో కలిసి పుష్కర్ ఘాట్ శుభ్రం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం నగరంలో స్వచ్ఛతాహి సేవ, ఇండియన్ స్వచ్ఛలీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా పిల్లలతో కలిసి ఘాట్ శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకూ నగరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడానికి షెడ్యూల్ రూపొందించామన్నారు. శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ పరిశీలన

రెడ్యూస్ రీయూస్ రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్లకు ఇళ్లలోని పాత బట్టలు, పుస్తకాలు, ఇతర వస్తువులను అందించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీఎల్‌పురంలో నిర్వహిస్తున్న ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన పాత బట్టలు, చెప్పులు, పుస్తకాలు, ఆటవస్తువులు శుభ్రపరచి తిరిగి పేద ప్రజలకు అందిస్తున్నామన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సిబ్బంది, పీఎంయూ బృందం పాల్గొన్నారు.

శరవేగంగా నగరాభివృద్ధి



శంకుస్థాపనలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: శరవేగంగా నగరాభివృద్ధి జరుగుతోందని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 37, 38 డివిజన్ల మధ్యలో సాధుస్త్రీల మఠం రోడ్డు నుంచి రూ.42 లక్షల అంచనాతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా 37, 38, 40, 41, 42 డివిజన్ల పరిధిలో సుమారు రూ.1.65 కోటి విలువైన పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు సుంకర అంజిబాబు, రఘుపాత్రుని సాయిబాబు, కె.వెంకటేశ్, ఉదయ్ రాణా పాల్గొన్నారు.

రైతు నేస్తం రుణాలు సత్వరమే అందించాలి

సీతానగరం: పీఏసీఎస్‌ల ద్వారా రైతు నేస్తం రుణాలను సంఘం సభ్యులకు సత్వరమే అందించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ డీజీఎం మద్దిపాటి శ్రీధర్ సూచించారు. గురువారం సీతానగరం పీఏసీఎస్ ఆవరణలో కోరుకొండ, సీతానగరం, తొర్రేడు పరిధిలోని పీఏసీఎస్ సీఈవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీజీఎం శ్రీధర్, ఏజీఎం వైసీహెచ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ సీసీ దాసరి సూర్యం, నోడల్ ఆఫీసర్ ఎన్.ఉమారాణి పాల్గొన్నారు. డీజీఎం శ్రీధర్ మాట్లాడుతూ రైతునేస్తంలో ఎకరానికి రూ. 8 లక్షల చొప్పున రూ. 40 లక్షల వరకూ రుణంగా అందించవచ్చన్నారు. దీనికి పదేళ్ల కాలపరిమితితో 12 శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. దీర్ఘకాలిక రుణాలు బోరు, మోటారు ఏర్పాటుకు ఎకరానికి రూ.3.42 లక్షలు అందిస్తామని, తొమ్మిదేళ్ల కాలపరిమితితో 11.85 శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. ల్యాండ్ డవలప్‌మెంట్‌కు ఎకరానికి రూ.2.50 లక్షలు, అర ఎకరం ఉంటే మేకలు, గొర్రెలకు రూ.2.05 లక్షలు, బండి ఎద్దులకు రూ.1.03 లక్ష లు, దీర్ఘకాలిక రుణంగా ఎకరానికి రూ.4 లక్షలు అందిస్తామన్నారు. ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ షార్ట్ టర్మ్ అదర్స్‌లో ఎకరానికి రూ.2.50 లక్షలు రుణంగా పొంది, 12 శాతం వడ్డీతో ప్రతి ఏడాది చెల్లించి రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

సినిమాలు



శ్యామల	: ఖుషి
సూర్యమినీ	: చంద్రముఖి-2
సూర్యప్యాలెస్	: 7జి బృందావన్ కాలనీ
స్వామి	: మార్క్ఆంటోని
శివజ్యోతి	: మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
అనుశ్రీ	: ఎక్స్‌పెండబుల్స్
రాజా	: మార్క్ఆంటోని
అశోక	: సప్త సాగరాలు దాటి
ఊర్వశి	: జవాన్
రంభ	: చంద్రముఖి-2
మేనక	: జైలర్
అప్సర	: జవాన్
నామవరం	
వీఎస్ మహల్	: మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మార్క్ఆంటోని
కడియం	
వెంకటసూర్య	: మార్క్ ఆంటోని